సాక్షి పెద్దపల్లి

శనివారం, 18, నవంబర్, 2023



పోలింగ్ కేంద్రాల పరిశీలన
మంథని: మున్సిపల్‌తోపాటు పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకుడు సీఎస్ శ్రీధర పరిశీలించారు. కనీస వసతులపై ఆరా తీశారు.



భక్తిశ్రద్ధలతో నాగుల చవితి
పెద్దపల్లిరూరల్: జిల్లాలో శుక్రవారం నాగుల చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఉదయమే పుట్టల వద్దకు వెళ్లి నాగ దేవతలకు పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
33.0/27.0

వాతావరణం
ఆకాశం మేఘాలతో కమ్ముకుని ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముందే మొదలైన ప్రలోభాలు





పట్టుబడిన ఎమ్మెల్యే శ్రీధర్ బాబు గోడ గడియారాల లారీ.

సాక్షిప్రతినిధి, కరీంనగర్: సాధారణంగా ఎన్నికల ప్రచారం పూర్తయ్యాక తాయిలాలు పంపిణీ చేస్తారు. అయితే ద్విముఖ పోటీ ఉన్న స్థానాల్లో, ప్రజల్లో వ్యతిరేకత ఉన్న అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు ముందుగానే ప్రలోభాలకు తెర లేపుతున్నారు. యువతను ఆకట్టుకునేందుకు డీజే బాక్స్‌లు, ఇంటింటికీ తమ ఫొటోతో గోడగడియారాలు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. కట్టుమెషిన్లు, కుక్కర్లు, కుంకుమ భరణిలు తదితర సామగ్రి, మద్యం పెద్దఎత్తున దిగుమతి చేసుకుని సమీప గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. నిఘా బృందాల కళ్లుగప్పి నియోజకవర్గాలకు చేరవేస్తున్నారు. అనేక చెక్‌పోస్టులు ఉన్నా దాటుకుని హైదరాబాద్ నుంచి మంథని నియోజకవర్గానికి చేరిన ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఫొటోలతో కూడిన గోడ గడియారాల లారీనే సజీవసాక్ష్యమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలంటున్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



సూచనలిస్తున్న రాజేశ్‌సింగ్ రాణా

గోదావరిఖనిటౌన్/గోదావరిఖని : నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా శుక్రవారం సందర్శించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని 95, 96, 97, 98 కేంద్రాలను తనిఖీ చేశారు. ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సెక్టార్ అధికారికి పలు సూచనలు చేశారు. ఓటర్లకు స్లిప్పులను పంపిణీ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, టెంట్, విద్యుత్, మహిళలకు ప్రత్యేక టాయిలెట్లు, దివ్యాంగులకు ర్యాంపు, మెడికల్, జనరేటర్, పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

ఓటు వేయడం బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

పెద్దపల్లిరూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైందని, ఓటరుగా నమోదైన ప్రతీ ఒక్కరు తమ బాధ్యతగా భావించి ఈనెల 30న ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుమోహన్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఓట్ ఫర్ ష్యూర్ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్వీప్ యాక్టివిటీస్ నోడల్ అధికారి రవుఫ్‌ఖాన్, సీడీపీవో కవిత పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టున్రి

అభివృద్ధిని వివరిస్తూ.. విపక్షాలపై విమర్శలు చేసిన సీఎం కేసీఆర్

- 'గంగుల' మొండి మనిషి
- కౌశిక్‌కు మెజారిటీ ఇవ్వండి
- బీఆర్‌ఎస్ అభ్యర్థులనే గెలిపించండి
- జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలతో గులాబీ శ్రేణుల్లో జోష్





సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్/హుజూరాబాద్/జమ్మికుంట/ఇల్లందకుంట/గంగాధర: రెండో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ శుక్రవారం కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల ప్రజాఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. పదేళ్లలో తాము చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. విపక్షాలపై విమర్శల వర్షం కురిపించారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాదసభలో సీఎం ప్రసంగం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఓ వైపు జిల్లా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరిస్తూనే మరోవైపు ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో, పదునైన మాటలతో ధ్వజమెత్తారు. 60 ఏళ్లు పరిపాలించిన ప్రతిపక్షాలు చేసిందేమీ లేదని, తాము పదేళ్లల్లో చేపట్టిన అభివృద్ధి కళ్లముందు పరుగులు పెడుతోందని అన్నారు. బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని, అలాంటి పార్టీని జిల్లా ప్రజలు 2001లో జరిగిన సింహగర్జన సభ నుంచి అక్కున చేర్చుకున్నారని గుర్తు చేశారు. రాయేదో.. రత్నమేదో ఆలోచించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు కర్రుకాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. మంత్రి గంగుల కమలాకర్ మొండి మనిషి అని ఆయన హయాంలో తీగలవంతెన, మానేరు రివర్ ఫ్రంట్, స్మార్ట్‌సిటీ పనులతో కరీంనగర్ సుందరీకరణ, కూడళ్ల అభివృద్ధి పరుగులు పెడుతోందని కితాబిచ్చారు. హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు.

34 నిమిషాలు ప్రసంగం...
బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో 34 నిమిషాలు ప్రసంగించారు. హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ నుంచి సభాప్రాంగణానికి 1.38 నిమిషాలకు చేరుకున్నారు. తెలంగాణ ప్రగతి రథంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మేయర్ వై.సునీల్‌రావు తదితరనేతలతో కలిసి 1.50నిమిషాలకు వేదికపైకి చేరుకున్నారు. మొదటగా కరీంనగర్ బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. సీఎం కేసీఆర్ సరిగ్గా 2.02 నిమిషాల నుంచి 2.36 నిమిషాల వరకు మాట్లాడారు. 2001లో సింహగర్జన సభను ఇదే వేదికగా నిర్వహించామని అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక విజయాలు సాధించామని, 50 ఏళ్ల కాంగ్రెస్ దరిద్రపు పాలనకు పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనకు బేరీజు వేసుకుని బాగా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్సీ మధుసూధనచారి, కార్పొరేషన్ చైర్మన్లు సర్దార్ రవీందర్‌సింగ్, కుర్మాచలం అనిల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, మాజీ మంత్రి రాజేశం గౌడ్ బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



కరీంనగర్ నియోజకవర్గంలో రూ.వేలకోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వాటి పరంపర కొనసాగింపునకు మరోసారి ఆశీర్వదించి, గెలిపించండి. గతంలో కరీంనగర్ బొంద లగడ్డగా ఉండేది. పదేళ్లల్లో రూ.వేలకోట్ల పనులతో రూపురేఖలు మారిపోయాయి. సీఎం కేసీఆర్‌కు జిల్లాపై అమితమైన ప్రేమ ఉంది. తెలంగాణ సాధన కోసం జరిగిన తొలి సింహగర్జన బహిరంగసభ నుంచి ఇప్పటి వరకు జిల్లా ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఢిల్లీ పాలకుల చేతుల్లో పెట్టొద్దు. జిల్లా ప్రజలు అభివృద్ధి వైపో.. విధ్వంసం వైపో తేల్చుకుని ఓటు వేయండి. – గంగుల కమలాకర్, కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి



రూ.వెయ్యి కోట్ల నిధులు తెస్తా
ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. కేసీఆర్ కాళ్లు పట్టుకోనైనా హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల నిధులు తెస్తా. ఉప్పల్, చల్లూరు, వావిలాల మండలాల ఏర్పాటుకు కృషి చేస్తా. ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే ప్రజలకు వెన్నుపోటు పొడిచి గజ్వేల్‌లో పోటీ చేస్తుండు. 15 ఏళ్లుగా ప్రజాసేవలోనే ఉన్నా. ఒక్కసారి అవకాశం ఇవ్వండి . అభివృద్ధి చేసి చూపిస్తా.
– పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి

కుక్కలు చింపిన విస్తరి అవుతుంది



తెలంగాణ తెచ్చాం. 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. గోదావరి జలాలతో కోటి ఎకరాలకు సాగునీరు అందించి చూపిస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉంది. వందేళ్ల వరకు ప్రగతి పరుగులు పెట్టే విధంగా ప్రణాళికలున్నాయి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మితే తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిలా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కేసీఆర్‌కు అండగా గులాబీ జెండా ఉంది. మంత్రి గంగులను భారీ మెజార్టీతో గెలిపించాలి.
– బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు

కొంగుపట్టి కోరుతున్నా
హుజూరాబాద్ నియోజకవర్గంలో 15 ఏళ్ల నుంచి ప్రజా సేవలోనే ఉన్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని గడప గడపకు చేరవేస్తున్నాం.కొంగు పట్టి కోరుతున్నా కౌశిక్‌రెడ్డికి ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన వెంటే నేను ఉంటా. – శాలిని, పాడి కౌశిక్‌రెడ్డి భార్య



సీఎం కేసీఆర్‌కు బొట్టు పెడుతున్న పాడికౌశిక్ కూతురు శ్రీనిక

డాడీకి ఒక్క చాన్స్ ఇవ్వండి
హుజూరాబాద్ నియోజకవర్గాన్ని హైదరాబాద్‌లా అభివృద్ధి చేయాలన్నదే మా డాడీ కళ. మీ అందరికీ దండంపెట్టి కోరుతున్నా. డాడీకి ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. డాడీ వెంట పడి హుజూరాబాద్ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు నిధులు తెచ్చేలా చేస్తా.
– శ్రీనిక, కౌశిక్‌రెడ్డి కూతురు



కేసీఆర్‌కు గద అందిస్తున్న సునీల్‌రావు

'కట్టప్ప'లతో కలవరం!

- అన్ని పార్టీల్లో నేతలకు కోవర్టుల భయం
- వ్యూహాలు ప్రత్యర్థులకు చేరవేతలు
- ఎన్నికలు సమీపిస్తుండటంతో జోరుగా ఫిరాయింపులు
- రహస్య ఆపరేషన్స్‌కు కొత్తగా చేరిన వారిని దూరం పెడుతున్న నేతలు



➡ ఉమ్మడి జిల్లాలోని ఓ నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ కౌన్సిలర్ ఒకరు పార్టీ మారుతున్నడనే సమాచారం కోవర్టుల ద్వారా తెలుసుకున్న సదరు నేత వెంటనే అప్రమత్తమై ఆ కౌన్సిలర్ పార్టీ మారకుండా బుజ్జగించాడు.

➡ ఒక ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ఖర్చు కోసం కొంత డబ్బును రహస్యంగా కారులో హైదరాబాద్ నుంచి తన నియోజకవర్గానికి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడింది. కోవర్టుతోనే సమాచారం లీకై నగదు పట్టుపడినట్లు ఆ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

➡ మరోనియోజకవర్గ నేత తన సెగ్మెంట్ పరిధిలో దసరా కానుకగా డీజే సౌండ్ బాక్స్‌లు పంచిపెట్టాలనుకున్నారు. అలాగే తన పేరుతో గోడ గడియారాలు పంచిపెట్టడానికి లారీలో తరలిస్తుండగా పట్టుబడింది. ప్రత్యర్థుల పార్టీల్లోకి కోవర్టులను పంపి వారి సమాచారం సేకరించే సదరు నేతకు ఈసారి కోవర్టులతో రివర్స్ షాక్‌లు కొడుతున్నాయి. దీంతో ఎవరిని నమ్మాల్నో.. ఎవరికి ఏంచెప్పాల్నో అర్థమైతలేదని వాపోతున్నాడు.

సాక్షి, పెద్దపల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా అన్ని పార్టీల్లో ఫిరాయింపులు జోరుగా సాగుతున్నాయి. దీంతో కొత్తగా వచ్చిచేరిన నేతలు లేదా పార్టీ మారకుండా అసంతృప్తిగా ఉన్న ఇంటిదొంగలు తమ వ్యూహాలు లీక్ చేస్తున్నారేమోనని పలువురు నేతలు సతమతమవుతున్నారు. సొంత శిబిరంలోని ఇలాంటి ×కట్టప్పల₹ను పట్టుకోవడం ఎట్లా అని? వారు తలలు పట్టుకుంటున్నారు.

నేతలకు కోవర్టుల టెన్షన్..
- పోలింగ్ గడువు సమీపిస్తున్న కొద్దీ కొలది నేతలకు కోవర్టుల టెన్షన్ పెరిగిపోతోంది.
- ఎన్నికల్లో విజయం సాధించాలంటే తాము ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తున్నామనేది ఎంతముఖ్యమో.. ప్రతిపక్ష పార్టీ నేతలు వేసే ఎత్తుగడలను ముందే పసిగట్టడం అంతే ముఖ్యంగా భావిస్తున్న నేతలు.. కోవర్టు అస్త్రాలు సంధిస్తున్నారు.
- ప్రత్యర్థి పార్టీల నేతలను తమ పార్టీలోకి లాక్కోవడంతోపాటు, తమ పార్టీలోని నేతలు ప్రత్యర్థి గూటికి చేరకుండా చూసుకోవడం ఇప్పుడు కత్తిమీద సాములా మారింది.
- దీంతో ప్రత్యర్థి పార్టీల్లో తమ అనుచరులను ఉంచేలా చూసుకుంటున్నారు.
- దానికోసం భారీగా ఆర్థిక సాయం అందించటంతోపాటు, ఎన్నికల అనంతరం పదవుల హామీతో ప్రత్యర్థి శిబిరంలోకి పంపుతున్నారు.
- ప్రజల నాడీ తెలియక తికమకపడుతున్నా నేతలకు, పార్టీలో మనస్ఫూర్తిగా పనిచేస్తున్న వారు ఎవరో, కట్టప్పలు ఎవరో తెలియక ఆందోళన చెందుతున్నారు.
- ఫిరాయింపు నేతలతోపాటు సొంతపార్టీల్లోని అసమ్మతి నేతలను సైతం అనుమానిస్తూ, ఎవరిని నమ్మాలో తెలియక టెన్షన్ పడుతున్నారు.

గతంలో చేదు అనుభవాలతో..
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలానియోజకవర్గాల్లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులే మళ్లీ ఎన్నికల బరిలో తలపడుతున్నారు. తాయిలాలు, డబ్బు, పార్టీలో చేరికలు తదితర అంశాలను కోవర్టులు లీక్ చేయటంతోనే గతంలో తీవ్రంగా నష్టపోయారు. ఈసారి ఎన్నికల్లో కీలకమైన ఆర్థిక వ్యవహారాలు, పార్టీ ఫండ్ తదితర వివరాలను పార్టీ నేతలకు కాకుండా తమ బంధువులు, కుటుంబ సభ్యులే చూసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఓటర్లకు ఇచ్చే నజరానాలు, ఫండింగ్ ఇస్తున్నదెవరు? అనే అంశాలను తమ అనుచరులకు తెలియకుండా జాగ్రత్తపడుతున్నారు. పార్టీ నేతలు, కీలక నేతలను కేవలం ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాల ఖరారు చేయడానికే పరిమితం చేస్తున్నారు. దీంతో కొందరు కార్యకర్తలు నొచ్చుకుంటున్నారు. అయినా, ఒక్కోసారి ఎంత జాగ్రత్త పడినా రాత్రి అనుకున్న విషయాలు తెల్లారేలోగా పక్క పార్టీలకు చేరుతున్నాయి. ఇలా లీకేజీలకు పాల్పడుతున్న కోవర్టులు అన్ని పార్టీలకు దడపుట్టిస్తూ తలనొప్పిగా మారుతున్నారు.

సింగరేణి మనుగడ కేసీఆర్‌తోనే సాధ్యం

- రామగుండం బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్
- జీడీకే–5 ఓసీపీ, ఆర్జీ–2 ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశం



సభలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: సింగరేణి మనుగడ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం జీడీకే–5 ఓసీపీ, ఆర్జీ–2 ఏరియా బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలతో జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల వారసులకు ఉద్యోగాలు అమలు చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఏనాడూ కార్మికుల పక్షాన ఆలోచన చేసిన పాపానపోలేదన్నారు. వారసత్వ ఉద్యోగాలను పోగొట్టింది జాతీయ కార్మిక సంఘాలని, వాటిని కారుణ్య నియమాకాల పునరుద్ధరించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని అన్నారు. కార్మికులంతా ఏకతాటిపై నిలిచి రామగుండంలో గులాబీ జెండా ఎగిరేలా కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు చేస్తే ఆందోళన చేస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సింగరేణి కార్మికుల ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొనే పరిస్థితి ఉండేదన్నారు. జీతం తీసుకుని ఇంటికి వెళ్తుంటే కాంగ్రెస్ పార్టీ గూండాలు దోచుకునేవారని ఆరోపించారు. వారు దొంగ మొక్కులతో వస్తున్నారని, తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు, బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్‌ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నాయకులు ఐలి శ్రీనివాస్, మూల విజయరెడ్డి, కార్పొరేటర్లు సాగంటి శంకర్, బాదె అంజలి, మందల కిషన్‌రెడ్డి, దేవ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి

పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న మమతారెడ్డి



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: పోరాడి తెలంగాణ రాష్ట్రం సాధించడమే కాకుండా అన్ని రంగాల్లో దేశానికే మోడల్‌గా నిలిపిన కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బండారి వెంకన్న, శివరాత్రి వీరన్న, వేముల శ్రీనివాస్‌కు బీఆర్‌ఎస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత బీఆర్‌ఎస్ సర్కార్‌దేనన్నారు. ఈ ఎన్నికల్లోనూ ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, కౌన్సిలర్లతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. మేన్‌రోడ్‌లోని వ్యాపారులను కలిసి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు.

కేసీఆర్‌తోనే ఇంటింటికీ సంక్షేమ ఫలాలు
కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): అలుపెరుగని పోరుతో తెలంగాణ సాధించిన సీఎం కేసీఆర్ ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దంపేటలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మితే గోసపడుతామని అన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, మరోసారి కారుగుర్తుకు ఓటేసి హ్యాట్రిక్ సాధించబోతోందని జోస్యం చెప్పారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గొడ్డు రాజకొమురయ్య, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ కొట్టె సుజాత, పీఏసీఎస్ చైర్మన్లు రాంచంద్రారెడ్డి, పురుషోత్తం, సర్పంచులు ఓదెల రవి, బండ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ కదురు మానస, నాయకులు జక్కుల మోహన్, కమలమ్మ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇల్లు దగ్ధం

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక మార్కండే కాలనీకి చెందిన వనపర్తి గోవిందమ్మ ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం అయ్యింది. నగదు, దుస్తులు, సర్టిఫికెట్లు కాలిపోయాయి. సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లినట్లు స్థానిక బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. నాయకులు బోయిరి రాజేందర్, చింతల అర్జున్, దేవా, నాగరాజు, మోహన్ బాబు బాధితకుటుంబాన్ని పరామర్శించారు.

బస్సులు లేక విద్యార్థుల అవస్థలు



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: ఖని బస్టాండ్‌లో శుక్రవారం ఆర్టీసీ బస్సుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రామగుండం లింగాపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేందుకు రోజూ 2బస్సుల నడుపుతారు. కానీ, శుక్రవారం ఒక్క బస్సే నడపడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అసహనంతో బస్టాండ్ ఎదుట గల రాజీవ్‌రహదారిపైకి వచ్చి నిరసనను తలిపారు. విద్యార్థుల ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈవిషయంపై డిపో మేనేజర్ నాగభూషణం మాట్లాడుతూ, బస్సుల కొరతతో ఒకే బస్సు నడిపంచామన్నారు. ఆలస్యంగానైనా రెండు ట్రిప్పులు నడిపించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించామని తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న హనుమానాయక్

రామగిరి(మంథని): ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈవీఎంల పనితీరుపై అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలని మంథని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్ అన్నారు. జేఎన్టీయూలో చేపట్టి శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. శిక్షణ పొందిన పీవో, ఏపీవోలు పోలింగ్ కేంద్రాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీస్, నియోజకవర్గ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్రులే అధికం

- రామగుండంలో 11మంది.. పెద్దపల్లిలో 9మంది బరిలో..
- ప్రధాన పార్టీల్లో పోటాపోటీ
- గుర్తుల కేటాయింపు ప్రక్రియపూర్తి



గోదావరిఖని/జ్యోతినగర్/పెద్దపల్లిరూరల్: రామగుండం బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యింది. ప్రధాన పార్టీల గుర్తులతోపాటు స్వతంత్రులకూ గుర్తులను కేటాయించారు. ఈసారి పేరుతోపాటు గుర్తులు, అభ్యర్థుల ఫొటోలను ఈవీఎంలపై ముద్రించనున్నారు. పార్టీలు, అక్షర ప్రాధాన్యతా క్రమంలో బహుజన్‌సమాజ్ పార్టీ అభ్యర్థి అంబటి నరేశ్‌యాదవ్ పేరు ప్రథమంగా రాగా, ఇండిపెండెంట్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ పేరు చివరకు వచ్చింది.

పెద్దపల్లిలో..

పెద్దపల్లిలో నామినేషన్ల ఉపసంహరణ తర్వాత 17మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వారికి ×గుర్తుే్‌లు కేటాయించారు. పెద్దపల్లిలో మొత్తం 30 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అందులో ఐదుగురి దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మిగతా వారిలో 8మంది తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. 17మంది పోటీపడుతున్నారు. ఇందులో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీఎస్పీ, బీజేపీ, న్యూ ఇండియా, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీలు, 9మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు.

అభ్యర్థుల వారీగా కేటాయించిన గుర్తులు ఇవే..

అభ్యర్థి	పార్టీ	గుర్తు
రామగుండంలో 11 మంది..		
అంబటి నరేశ్‌యాదవ్	బీఎస్పీ	ఏనుగు
కందుల సంధ్యారాణి	బీజేపీ	కమలం
కోరుకంటి చందర్	బీఆర్ఎస్	కారు
ఎంఎస్ రాజ్‌ఠాగూర్	కాంగ్రెస్	హస్తం
గొర్రె రమేశ్	తెలంగాణ లేబర్	టెలివిజన్
మన్మోహన్ తమ్మెర	విద్యార్థుల రాజకీయ	బ్యాట్
పారువెల్లి జీవన్‌రావు	జనశంఖారావం	బెండకాయ
పెరుమండ్ల వేదభూషణ్	పిరమిడ్	ఎయిర్‌కండీషనర్
రాజ్‌కుమార్ పులిపాక	ధర్మసమాజ్	బ్యాటరీటార్చ్
అశోక్ వేముల	న్యూఇండియా	కుండ
శీలం శ్రీనివాస్	భారతీయ స్వదేశ్‌కాంగ్రెస్	పిల్లనగోవి
సామల అరవింద్	ఆలిండియా డెమొక్రటిక్ రిఫార్మ్స్	చపాతీరోలర్
కాంపెల్లి రఘుబాబు	స్వతంత్ర	బీరువా
కీర్తికాంత్ గుడిమల్ల	స్వతంత్ర	లాప్‌టాప్
గజ్జెల్లి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	రోడ్డురోలర్
నీరటి శంకర్	స్వతంత్ర	ఆపిల్
నెలకంటి రాము	స్వతంత్ర	ఓడ
పెద్దపల్లి సందీప్	స్వతంత్ర	స్విచ్‌బోర్డు
బి.చంద్రశేఖర్	స్వతంత్ర	బెలూన్
మంచికట్ల దయాకర్	స్వతంత్ర	ఫుట్‌బాల్
షాకిర్‌బాబా	స్వతంత్ర	బేబీవాకర్
లింగాల శంకర్	స్వతంత్ర	టైర్లు
సోమారపు సత్యనారాయణ	స్వతంత్ర	వజ్రం
పెద్దపల్లిలో 9మంది		
విజయరమణారావు	కాంగ్రెస్	హస్తం
దాసరి ఉష	బీఎస్పీ	ఏనుగు
దాసరి మనోహర్‌రెడ్డి	బీఆర్ఎస్	కారు
డి.ప్రదీప్‌కుమార్	బీజేపీ	కమలం
ఆమని బచ్చలి	ధర్మసమాజ్	టార్చ్‌లైట్
జనగామ తిరుపతి	న్యూఇండియా	కుండ
ఢిల్లీశ్వర్‌రెడ్డి	పిరమిడ్	పిల్లనగ్రోవి
డి.రాజ్‌కుమార్	బీఎస్సీ	టెలివిజన్
కె.నరేశ్	స్వతంత్ర	డోలి
కె.దేవేందర్‌గౌడ్	స్వతంత్ర	బీరువా
గుంటి కుమారస్వామి	స్వతంత్ర	చపాతిరోలర్
చిలుక ఆనంద్	స్వతంత్ర	గ్యాస్‌సిలిండర్
చింతపండు అనిల్	స్వతంత్ర	రోడ్డురోలర్
నవీన్ నూకల	స్వతంత్ర	బ్యాట్
పెండ్యాల సురేందర్	స్వతంత్ర	ఉంగరం
బూతగడ్డ నరేశ్	స్వతంత్ర	ఎయిర్‌కండిషనర్
శ్రావణ్ పెద్దపల్లి	స్వతంత్ర	స్విచ్‌బోర్డు

జిల్లా ఓటర్లు 7,11,727

ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	పోలింగ్ కేంద్రాలు
పెద్దపల్లి	2,54,266	1,26,046	1,28,212	8	290
మంథని	2,36,442	1,16,707	1,19,716	19	288
రామగుండం	2,21,019	1,11,200	1,09,794	25	259

- తేలిన మొత్తం ఓటర్ల సంఖ్య
- పెద్దపల్లి, మంథనిలో మహిళా ఓటర్లే అధికం
- ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 52మంది

మండలాల వారీగా ఓటర్లు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
పాలకుర్తి	11160	11210	0	22370
అంతర్గాం	9894	10156	0	20050
రామగుండం	90146	88428	25	178599
రామగిరి	18602	18180	1	36783
కమాన్‌పూర్	9816	9944	0	19760
పాలకుర్తి	3980	4042	1	8023
మంథని	23434	24383	6	47823
కాటారం	14429	15186	9	29624
మహదేవపూర్	11985	12602	2	24589
పలిమెల	2637	2736	0	5373
మహాముత్తారం	10013	10171	0	20184
మల్హర్‌రావ్	10770	11123	0	21893
ముత్తారం	11041	11349	0	22390
పెద్దపల్లి	45048	45673	3	90724
శ్రీరాంపూర్	16884	16928	1	33813
ఓదెల	17233	17610	0	34843
సుల్తానాబాద్	27070	27793	3	54866
ఎలిగేడు	9005	9260	1	18266
జూలపల్లి	10806	10948	0	21754



పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఓటరు తుదిజాబితా సిద్ధమైంది. మొత్తం ఓటర్లు 7,11,727 మందదిగా తేలింది. జాబితాలో ఓటరు పేరు, చిరునామా వివరాలు, ఫొటోలతో కూడిన జాబితాను అధికారులు విడుదల చేశారు. జిల్లాలో 3,53,953 మంది పురుషులు ఉంటే 3,37,722 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 52మంది ట్రాన్స్‌జెండర్లు ఓటుహక్కు కలిగిఉన్నారు. జిల్లాలో 837 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పెద్దపల్లిలో ఆరు మండలాలు..

పెద్దపల్లి నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయి. ఇందులో పెద్దపల్లి, శ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి.

మంథనిలో..

మంథని నియోజకవర్గంలో పది మండలాలు ఉన్నాయి. ఇందులో రామగిరి, కమాన్‌పూర్, పాలకుర్తి, మంథని, కాటారం, మహదేవ్‌పూర్, పలిమెల, మహాముత్తారం, మల్హార్, ముత్తారం(మంథని).

రామగుండంలో..

రామగుండం నియోజకవర్గంలో మూడు మండలాలు, ఒక కార్పొరేషన్ ఉన్నాయి. పాలకుర్తి, అంతర్గాం, రామగుండం మండలం, రామగుండం కార్పొరేషన్ ఉన్నాయి. కాగా, నియోజకవర్గంలో మొత్తం సింగరేణి బొగ్గు బావులున్న గోదావరిఖనిలోనే 1,78,599 మంది ఓటర్లుండడం గమనార్హం.

అమ్మా.. వైద్యసేలు ఎలా ఉన్నాయి..

- ఉదయం 9గంట నుంచే ఓపీ సేవలు అందాలి
- బయోమెట్రిక్‌తో హాజరు నమోదు చేయండి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలు



మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్:×అమ్మా.. వైద్య సేవలు ఎలా అందుతున్నాయి.. వైద్యులు, సిబ్బంది పనితీరు ఎలా ఉంది?₹ అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేషెంట్లతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పలు బ్లాకులను పరిశీలించారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని, బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని సూపరింటెండెంట్ రమాకాంత్‌ను ఆదేశించారు. ఉదయం 9గంటల నుంచే ఓపీ సేవలు మొదలు కావాలన్నారు. తొలికాన్పుకు వచ్చేవారికి సాధారణ ప్రసవం జరిగేలా చూడాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ఆప్తమాలజీ ఆపరేషన్ థియేటర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డాక్టర్ శౌరయ్య తదితరులు ఉన్నారు.

ప్రాథమిక స్థాయినుంచే మెరుగైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేట్‌కు దీటుగా సౌకర్యాలను కల్పిస్తున్నామని, అదేరీతిన బోధన అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బందంపల్లి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించారు. పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ

జ్యోతినగర్(రామగుండం): ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణ శ్రీ అన్నారు. ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఆడిటోరియం హాల్‌లో ఎన్నికల నిర్వహణపై సెక్టార్ అధికారులు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. రామగుండం నియోజకవర్గంలోని మొత్తం 263 పోలింగ్ కేంద్రాల్లో అన్నిసౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, జీపీఎస్, సీసీ కెమెరాలు 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసారి పోలింగ్‌శాతం పెంపు లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులు అందించాలని అన్నారు. ఇంటినుంచే ఓటు వేసే విధానంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ 13 రకాల అత్యవసర సేవా విభాగాల్లో పనిచేసే వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కు కల్పించిందని, వీరికోసం రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఒక తేదీ నిర్ణయించి, ఆరోజు పోస్టల్ ఓటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం మొదటి ఓటర్ స్లిప్‌ను రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ మెప్మా పీడీ రజని, ఆర్‌పీ స్వప్న చేతుల మీదుగా అందుకున్నారు. ఏఆర్వోలు కుమారస్వామి, జ్యోతి, కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, ఎంఈవో, మీడియా నోడల్ అధికారి రజని ఉన్నారు.

పోలీసుల కవాతు



గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా శుక్రవారం వన్ టౌ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి లక్ష్మీనగర్ మీదుగా ప్రధాన వీధుల గుండా కవాతు కొనసాగింది. ఏసీపీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సుల్తానాబాద్ రూరల్: గట్టెపల్లి గ్రామాభివృద్ధి పేరిట ఇసుక లారీల నుంచి వసూలు చేస్తున్న నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తు ఆ గ్రామస్తులు శుక్రవారం ఇసుక లారీలను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి వాగులో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేశారని, దానినుంచి లారీల ద్వారా ఇసుక తరలిస్తుండగా గ్రామాభివృద్ధి కమిటీ పేరిట రసీదు బుక్కులు ప్రజాప్రతినిధులు తయారు చేసి ఒక్కో లారీకి రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారని తెలిపారు. నీ డబ్బును గ్రామపంచాయతీ ద్వారా గ్రామాభివృద్ధికి మాత్రమే వినియోగిస్తామని చెప్పినా.. ఆ పనులు చేయడం లేదని ఆరోపించారు. ఈ నిధులపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా లారీల నుంచి గ్రామపంచాయతీ ఎలాంటి డబ్బులు వసూలుచేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శీలం శంకర్, మాజీ సర్పంచ్ రాజమౌళి, గ్రామస్తులు రాజారాం, గుర్రం శ్రీనివాస్, మధుకర్, సంతోష్, గౌస్, కొడెం శ్రీనివాస్, రమణ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

గోదావరిఖని: కాగజ్‌నగర్ నుంచి గోదావరిఖనికి రవాణా అవుతున్న 4కిలోల గంజాయిని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గోదావరి బ్రిడ్జి ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేసి రెండుబైక్‌లపై వచ్చిన ఐదుగురు యువకులను ఆపి తనిఖీ చేయగా బ్యాగ్‌లలో 4.060 కేజీ డ్రైగంజాయి పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. గాజుల సిద్ధార్థ, దాసరి వినోద్, ఇర్ఫాన్, సతికం శ్రీరామ్‌వర్మ, అజరుద్దీన్‌గా పేర్కొన్నారు. వ్యసనాలకు బానిసై గంజాయి తాగడంతోపాటు విక్రయాల కోసం ఈదారి ఎంచుకున్నట్లు పోలీసులు వివరించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురుదేశంతో ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి నుంచి గుర్తుతెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి గోదావరిఖని ప్రాంతంలోని అమాయకపు స్టూడెంట్స్, యువతకి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు నిందితులు వెల్లడించారు. నిందితుల వద్ద లభించిన గంజాయిని స్వాధీనం చేసుకుని పూర్తిస్థాయి విచారణ కోసం గోదావరిఖని టూటౌన్ పోలీసులకు అప్పగించామన్నారు.

102 మంది బైండోవర్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో 102 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్సై జీవన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల నిర్వహణలో భాగంగా రోజువారీ తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎక్సైజ్ విభాగంలో 14 కేసుల్లో రూ.96,656 విలువైన మద్యం, రెండు కేసుల్లో ఆరు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.54,50,670 నగదు, 27 కేజీల వెండి స్వాధీనం చేసుకుని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అప్పగించామన్నారు. 102 మంది బైండోవర్‌లో 16 మంది రౌడీషీటర్లు ఉన్నారని, మరికొన్ని కేసుల్లో ఇంకొందరిని బైండోవర్ చేస్తామన్నారు.

'దళితులను మోసం చేసిన కాంగ్రెస్'



మాట్లాడుతున్న చిలుక ప్రసాద్

రామగుండం:దళితులు, బహుజనులు, అణగారిన వర్గాలను కాంగ్రెస్ పార్టీ ఆర్థికంగా అణచివేసిందని దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు చిలుక ప్రసాద్ ఆరోపించారు. అంతర్గాం ప్రెస్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ దళితులను ఓటు బ్యాంకుగానే పరిగణించిందని విమర్శించారు. ఒక్క అవకాశం పేరిట కర్ణాటకలో కాంగ్రెస్ 24 గంటల విద్యుత్, రూ.రెండు వేల పింఛన్ హామీలతో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అన్నింటా విఫలమైన విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో సమితి ప్రతినిధులు గడమండ శ్రీహరి, కనుకుంట్ల రమేశ్, మామిడిపెల్లి శ్రీనివాస్, రొడ్డ సంపత్, మాతంగి శివరాజ్ పాల్గొన్నారు.

పోటాపోటీ ప్రదర్శనలు.. ఓటర్లకు పలకరింపులు

- ఊపందుకున్న ఎన్నికల ప్రచారాలు



మంథని: ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. రాష్ట్రంలోనే మంథని నియోజకవర్గం విస్తీర్ణంలో చాలా పెద్దది కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు కంటిమీద కునుకు లేకుండా రాత్రి, పగలు ప్రచారం చేస్తూనే ఉన్నారు. నియోజకవర్గంలో పది మండలాలు, సుమారు 2.30లక్షలకు పైగా టర్లు ఉన్నారు. వారిని మచ్చిక చేసుకునేందుకు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీతో పాటు స్వతంత్రులూ పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. మహిళలు, యువకులతో ప్రత్యేకంగా సమావేశమవుతూనే, చేరికలపై దృష్టిసారిస్తున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో సమావేశాలు నిర్వహిస్తూ పొద్దంతా గ్రామాల్లోనే అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు.

గతానికి భిన్నంగా..

మంథని నియోజకవర్గంలో ఈసారి ఎన్నికలు గతం కంటే భిన్నంగా జరుగుతున్నాయి. ఓటర్లు ఎవరివైపు ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొనడంతో అభ్యర్థులు వారి మద్దతు కూడగట్టుకునే పనిలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు, కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, బీజేపీ నుంచి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి తమదైన శైలిలో ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ప్రధాన పార్టీల ముఖ్య నాయకుల ప్రచారాలు అభ్యర్థుల్లో కొత్త ఉత్సాహం నింపుతున్నాయి. అభ్యర్థులే కాకుండా వారి బంధువులు, కూతుళ్లు, కుమారులు కూడా ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. అభ్యర్థులు గెలుపు ధీమాలో ఎవరికి వారే ప్రచారాలు సాగిస్తున్నారు, దీంతో మంథని నియోజకవర్గంలో రసవత్తరమైన రాజకీయ వాతావరణం నెలకొంది.

వీల్‌చైర్లు సిద్ధం



కోల్‌సిటీ: నియోజకవర్గంలో ఎన్నికల కోసం 116 వీల్‌చైర్లను ఉన్నతాధికారులు ముందస్తుగా తెప్పించారు. పోలింగ్ కేంద్రాల వరకు నడవలేనిస్థితిలో ఉన్న వృద్ధులు, వికలాంగులను వీల్‌చైర్ ద్వారా తరలించనున్నారు. వీటిని రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సీఆర్‌సీ భవనంలో భద్రపరిచారు.



కిక్కెక్కింది.. నిద్ర ముంచుకొచ్చింది

మందు బాబులూ.. ఒక్కక్షణం ఆలోచించండి.. మనం బయటకు వెళ్తే మళ్లీ ఇంటికొచ్చే దాకా మన కుటుంబం కళ్లలో వత్తులు వేసుకుని మరీ ఎదురుచూస్తూ ఉంటుంది. ఏదైనా జరగరానిది జరిగి ప్రాణాలు పోతే వాళ్లకు దిక్కెవరు? ఈ విషయం ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే.. జిల్లా కేంద్రంలోని అయ్యప్పగుడి చౌరస్తావద్ద రోడ్డుపై ఓ వ్యక్తి ఇలా గాఢనిద్రలో పడుకున్నాడు. చిత్తుగా మద్యం తాగడంతో మత్తు ఆవరించింది. ఆ కిక్కుతో ఒళ్లు మరిచి ఇలా నడిరోడ్డుపై నిద్రలోకి జారుకున్నాడు. ఎన్నికల వేళ.. ఎవరు పిలిచి మద్యం తాగించారో లేక.. సొంతంగా కొనుగోలు చేసి తాగాడో తెలియదు కానీ.. రాజీవ్‌రహదారి సిగ్నల్స్ పక్కనే రోడ్డుపై నిద్రపోతున్నాడు.. వాహనాల రద్దీ అధికంగా ఉంది. వాహనదారులు ఏమరుపాటుగా ఉంటే.. ప్రాణాలే పోవచ్చు. కానీ 'సాక్షి' చొరవ చూపింది. రోడ్డు నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి